నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, ఆదివారం 10 నవంబర్ 2024 | YADADRI BHUVANAGIRI

స్వర్ణగిరిలో హైకోర్టు జడ్జి కార్తీక్ పూజలు

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 9 : పట్టణ పరిధిలోని స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని తెలంగాణ హైకోర్టు జడ్జి పుల్ల కార్తీక్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పూజల్లో చేశారు. ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం ఎంతో సంతోషాన్ని కలిగించిందని హైకోర్టు న్యాయమూర్తి పుల్ల కార్తీక్ తెలిపారు.

స్వర్ణగిరిలో పూజల్లో పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తి పుల్ల కార్తీక్

బుల్డోజర్లతో ప్రజలే మిమల్ని కూలుస్తరు

నిధులు మరిచి తిట్ల పురాణం సిగ్గుచేటు
సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల భాషలకు సిగ్గు పడుతున్నారు
జడ్పీ మాజీ చైర్మన్ బండ, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి, కంచర్ల ఫైర్

నీలగిరి, నవంబర్ 9 : పుట్టినరోజు సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఉమ్మడి నల్లగొండ జిల్లాకు పర్యటనకు వస్తే వరాలు కురిపిస్తాడని జనం ఎదురుచూస్తూ.. పైసా ఇవ్వకపోగా, తిట్ల పురాణం పెట్టడం సిగ్గు చేటని జడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి మండిపడ్డారు. గతంలో సీఎం హోదాలో కేసీఆర్ జిల్లా పర్యటనకు వస్తే కోట్లాది రుపాయల నిధులు వచ్చేవని గుర్తు చేశారు. శనివారం నల్లగొండ జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి మాట్లాడుతూ పుట్టిన రోజైనా రేవంత్‌రెడ్డి తన బుద్ధి, భాష మార్చుకోకపోవడం సిగ్గుచేటన్నారు. మూసీ ప్రక్షాళణ యాత్రలో ఆయన మాట్లాడిన తీరు తీవ్ర అభ్యంతరకరమన్నారు. దేవుడి సన్నిధి నుంచి వచ్చినా కూడా మూసీ కంటే ఆయన నోరే కంపు అన్న రీతిలో వ్యవహరించారని మండిపడ్డారు. 11 నెలల పాలనలో ప్రజలకు ఏం చేశారో చెప్పుకొనేందుకు ఏమీ లేక మాజీ సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావును తిట్టడమే పనిగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. సీఎం కుర్చీలో కూర్చుని రేవంత్‌రెడ్డి వాడుతున్న భాష విసమాజానికి ఏం సందేశం ఇస్తున్నదో ఆలోచించుకోవాలన్నారు. మూసీ ప్రక్షాళనకు బీఆర్ఎస్ వ్యతిరేకంగా కాదని, కేవలం దాని పేరుతో జరుగుతున్న దోపిడీ కుట్రలపైనే తమ అభ్యంతరమని తెలిపారు. ఆ కార్యక్రమాన్ని అడ్డుకుంటే బుల్డోజర్లతో తొక్కిస్తం.. ముక్కలు చేస్తాం... కుక్క చావు చస్తావ్ అంటూ మాట్లాడడం హత్యా రాజకీయాలను ప్రోత్సహించేలా ఉందన్నారు. హైదరాబాద్ ప్రజలకు వద్దకు వెళ్తే తిరుగబడతారని నల్లగొండకు వచ్చి డ్రామాలు చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. మూసీ యాత్ర అంటూ జిల్లాకు వచ్చిన సీఎం ఒక్క హామీ అయినా ఇచ్చారా? ఒక్క పథకానికైనా అదనంగా నిధులు ఇచ్చారా? అని ప్రశ్నించారు. సీఎం భాషను చూసి మంత్రులు కూడా అడ్డగోలుగా మాట్లాడుతూ రాజకీయాలను భ్రష్టు పట్టిస్తున్నారన్నారు. ప్రజలు నిలదీస్తారనే భయంతోనే పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టులు చేసి, కాంగ్రెస్ కార్యకర్తలతో సభను నిర్వహించుకోవడం సిగ్గు చేటన్నారు. సీఎం స్థాయిని దిగజార్చుతున్న రేవంత్‌రెడ్డికి ఏ మాత్రం సిగ్గూశరం ఉన్నా ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రక్షాళన పాదయాత్ర అట్టర్ ఫ్లాప్ అయ్యిందన్న ప్రేస్టేషన్‌లో అడ్డగోలు ఆరోపణలు చేశారన్నారు. 11 నెలల పాలనలో ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏం మేలు చేసిందో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బుల్డోజర్లతో ప్రజల ఇండ్లను కూల్చడం కాదు.. ప్రజలే మీ ప్రభుత్వాన్ని బుల్డోజర్లతో కూల్చేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

నల్లగొండ జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, పక్కన నల్లగొండ జడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

ప్రజలను పక్కదారి పట్టించేందుకే పాదయాత్ర : బండ

హైదరాబాద్‌లో హైడ్రా అలజడి నుంచి ప్రజలను పక్కదారి పట్టించేందుకే రేవంత్ రెడ్డి మూసీ ప్రక్షాళన పాదయాత్ర నల్లగొండ జడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి విమర్శించారు. మధ్యలో ఎక్కడో రెండు కిలోమీటర్లు నడువడం కాదు.. ప్రారంభం నుంచి చివరి వరకు పాదయాత్ర చేయాలని డిమాండ్ చేశారు. పోలీసుల ప్రమేయం లేకుండా మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతో కలిసి పాదయాత్రలో పాల్గొనాలని, అప్పుడే ప్రజల స్పందన తెలుస్తుందని అన్నారు. హైదరాబాద్‌లో ఫోర్త్ సిటీ పేరుతో అక్రమ సంపాదనకు రేవంత్‌రెడ్డి తెరలేపారని ఆరోపించారు. కుల గణన చేయకుండా బీసీలకు అన్యాయం చేయడం కోసం కుటుంబ సర్వే చేస్తున్నారన్నారు.

కాంగ్రెస్ పాలన పాపమే మూసీ మురికి : కంచర్ల

అరవయ్యేండ్లు తెలంగాణను పాలించిన కాంగ్రెస్ పాపమే మూసీ మురికికి కారణమని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి విమర్శించారు. పదేండ్లపాటు మూసీ ప్రక్షాళన కోసం కేసీఆర్ తీసుకున్న చర్యలతో నేడు ఆ పరిసర ప్రాంతాల భూములు సస్యశ్యామలంగా పండుతున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణాన్నే ఫణంగా పెట్టిన కేసీఆర్‌తో నీకు పోలికా.. కేసీఆర్ మాట ఎత్తే అర్హత కూడా నీకు లేదని సీఎం రేవంత్‌రెడ్డిని ఘాటుగా విమర్శించారు. మంత్రి పదవి ఎక్కడ ఉడిపోతుందోననే భయంతో సీఎం మెప్పు కోసం కేసీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. ఇదే కోమటిరెడ్డి గతంలో భువనగిరి ఎంపీగా ఉన్నప్పుడు కేసీఆర్ ఈ రాష్ట్రానికి దిక్సూచి అని గొప్పగా పొగడలేదనా అని ప్రశ్నించారు. ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల సంగతేంటో ప్రజలకు చెప్పాలన్నారు. వాటి అమలు చేయకుంటే ప్రజలు రోడ్ల మీద తిరుగనివ్వరని హెచ్చరించారు. సమావేశంలో నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, కనగల్ మాజీ ఎంపీపీ కరింపాష, నకిరేకల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొప్పుల ప్రదీప్ రెడ్డి, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు బోనగిరి దేవేందర్, కనగల్ మండలాధ్యక్షుడు ఐతగోని యాదయ్య, మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస్‌రెడ్డి, మెరుగు గోపినాథ్, మాజీ ఎంపీటీసీ సుంకిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కడారి కృష్ణయ్య, కొండూరు శంకర్, విద్యార్థి నాయకులు కట్ట శ్రీను బోమ్మరబోయిన నాగార్జున, గంజి రాజేందర్, షబ్బీర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎన్‌డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగరిగుట్టపై ఎందుకింత వివక్ష?

- సీఎం పర్యటనతో పైసా ప్రయోజనం లేదు
- కేసీఆర్ ఆనవాళ్లను తుడిచే దమ్ము రేవంత్‌కు లేదు
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం
- డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, నవంబర్ 9 : పుట్టిన రోజును సందర్భంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పులిహోర, దద్దోజనం తిని వెళ్లారే తప్ప దేవస్థాన అభివృద్ధికి ఒక్క రూపాయి సైతం కేటాయించలేదని ఎన్‌డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం యాదగిరిగుట్టలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి యాదగిరిగుట్ట పర్యటన వల్ల పైసా ప్రయోజనం లేదన్నారు. గతంలో ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ యాదగిరిగుట్టకు వచ్చిన ప్రతిసారీ నిధులు కేటాయించారని గుర్తు చేశారు. ప్రతి బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు ఇచ్చారని తెలిపారు. 95 శాతం పనులు పూర్తయ్యాయని మరో 5 శాతం మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు గుర్తు చేసినా నిధులు కేటాయించకపోవడం సరికాదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు సార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టితే ఆలయానికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని, ఎందుకింత వివక్ష అని ప్రశ్నించారు. సీఎం పర్యటనలో హామీలు, నిధులు ఇస్తారని ఎదురుచూసిన ప్రజలకు నిరాశే ఎదురైందన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రతి పనినీ చరిత్రలో నిలచేలా చేశారని, ఆయన ఆనవాళ్లను తుడిచే దమ్ము, ధైర్యం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేదన్నారు. ఆలయ పునర్నిర్మాణ ప్రారంభ దశలో చినజీయర్ స్వామి ఇచ్చిన సలహా మేరకు యాదాద్రి పేరు ప్రస్తావనకు వచ్చిందని తప్ప.. యాదగిరిగుట్టను యాదాద్రిగా మారుస్తూ బీఆర్ఎస్ ఎలాంటి జీవో విడుదల చేయలేదని స్పష్టం చేశారు. ఇప్పటికీ అన్ని ప్రభుత్వ పత్రాలు, కార్యాలయాల్లో యాదగిరిగుట్ట అనే ఉంటుందన్నారు. ఇది తెలియకుండా యాదాద్రిని యాదగిరిగుట్టగా పేరు మారుస్తున్నామని ప్రకటించడం అవగాహనరాహిత్యమేనని పేర్కొన్నారు. కూల్చివేతలు, కక్ష సాధింపు చర్యలపై ఉన్న ఆలోచన సీఎంకు కొత్త ప్రాజెక్టులపై లేదన్నారు. రేవంత్‌రెడ్డి రాక్షస పాలనకు నిరసనగా స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కేసీఆర్ పాలనలో ప్రభుత్వం ఎంత ధాన్యం కొనుగోలు చేసిందో.. ఇందిరమ్మ రాజ్యంలో ఎంత కొనుగోలు చేశారో త్వరలో లెక్కలతో చెబుతామన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇప్పటి వరకు సన్నవడ్లను కొనుగోలు చేసిన దాఖలాలు లేవని తెలిపారు. రుణ మాఫీ, రైతు బంధు, రైతు బీమాను ఎగ్గొట్టి రైతులను గోస పెడుతున్నారని మండిపడ్డారు. రియల్ ఏస్టేట్ వ్యాపారం చేస్తూ ఇక్కడి భూములను కొల్లగొట్టారని తమపై ఆరోపనలు నిరూపించాలని, సవాల్ విసిరారు. రేవంత్‌రెడ్డి పాలన చూసి మళ్లీ కేసీఆర్ వస్తే బాగుండని ప్రజలు మదన పడుతున్నారన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకయ్య, పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, కోశాధికారి అంకం నర్సింహ, యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు ముఖ్యర్ల సతీశ్, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ బాబా, నాయకులు కోన్యాల నర్సింహ్మారెడ్డి, షేక్ దావూద్, గుండ్లపల్లి వెంకటేశ్, సీస శేఖర్, దండబోయిన వీరేశం, సీస నర్సింహా, గడ్డం చంద్ర, గ్యాదపాక క్రాంతి పాల్గొన్నారు.

భువనగిరిలో సర్వే రికార్డును పరిశీలిస్తున్న అనితారామచంద్రన్

ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

- ఏ రోజు డేటాను ఆ రోజు ఆన్‌లైన్ చేయాలి
- ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి అనితారామచంద్రన్
- సర్వే షీట్ ప్రకారం పూర్తి సమాచారం తీసుకోవాలి

భువనగిరి అర్బన్/వలిగొండ, నవంబర్ 9 : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్, ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రత్యేక అధికారి అనితారాంచంద్రన్ సూచించారు. శనివారం భువనగిరి పట్టణంలోని వివిధ వార్డులతోపాటు వలిగొండ మండలం మాందాపురంలో పర్యటించి ఎన్యుమరేటర్లు సర్వే చేస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వేలో గుర్తించిన ప్రతి ఇంటినీ సందర్శించి సర్వే షీట్ ప్రకారం పూర్తి సమాచారం తీసుకోవాలన్నారు. సర్వేకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. సర్వే ఫారాల డేటాను ఏ రోజుకారోజు సంబంధిత ఎన్యుమరేటర్ ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయించాలని ఆదేశించారు. కార్యక్రమాల్లో జిల్లా అదనపు కలెక్టర్లు గంగాధర్, వీరారెడ్డి, మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి, డీఆర్డీఓ నాగిరెడ్డి, సివిల్ సప్లయ్ అధికారులు జగదీశ్, వనజాల, జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్, చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్ రెడ్డి, వలిగొండ ఎంపీడీఓ జితేందర్ రెడ్డి, తాసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు కొలుపుల అమరేందర్

కేసిఆర్‌ను దూషిస్తే ఊరుకునేది లేదు

- మూసీ శుద్ధీకరణకు బీఆర్ఎస్ అడ్డు కాదు.. ప్రజాధనం దుర్వినియోగానికే
- కోమటిరెడ్డీ.. నోరు అదుపులో పెట్టుకో
- రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు అమరేందర్

భువనగిరి అర్బన్, నవంబర్ 9. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఇష్టమొచ్చినట్టు దూషిస్తే ఊరుకునేది లేదని, నోరు అదుపులో ఉంచుకుని మాట్లాడాలని రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు కొలుపుల అమరేందర్ హెచ్చరించారు. శనివారం పట్టణంలోని రహదారి బంగ్లాలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంగెం మూసీ వద్ద మాట్లాడిన కాంగ్రెస్‌ళ్ల నోరు శుభ్రం చేయడానికి డెటాల్, ఫినాయిల్ సరిపోదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రాణాలను లెక్కచేయకుండా కొట్లాడి తెలంగాణ రాష్ట్రాన్ని తెస్తేనే రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాడన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. మూసీ ప్రారంభమైన అనంతగిరిలో కాకుండా 100 కిలోమీటర్ల దూరం వచ్చి యాత్ర చేపట్టడం ప్రజలను మభ్య పెట్టే నాటకమన్నారు. మూసీ కాలుష్యకూపంగా మారడానికి 50 ఏండ్లు రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్సే కారణమని మర్చిపోవదన్నారు. 2014కు ముందు జిల్లా ప్రజలు బిందెలతో నీళ్ల కోసం ఎదురుచూసే వారని, తెలంగాణ రాష్ట్రం తెచ్చుకున్నాక కేసీఆర్ మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించారని గుర్తుచేశారు. మూసీ శుద్ధీకరణకు బీఆర్ఎస్ అడ్డు కాదని, లక్షా 50 వేల కోట్ల ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయాలనే కుట్రను ఖండిస్తామని స్పష్టంచేశారు. మాజీ సీఎం కేసీఆర్ గోదావరి జలాలు తీసుకువచ్చి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలంగా చేశారని, వాటిలో పుణ్యస్నానం కాంగ్రెస్ నాయకులు పుణీతులు కావాలన్నారు. ఎన్నికల ముందిచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీల అమలు చేయలేక ప్రజలను పక్కదారి పట్టించడానికి డైవర్షన్ రాజకీయాలు చేయడం సిగ్గు చేటన్నారు. రైతు రుణమాఫీని ఒకే ధపాలో చేస్తానని లక్ష్మీనరసింహస్వామి మీద ఒట్టు పెట్టిన వాగ్దానం మరిచి స్వామి వారి దర్శనానికి రావడం సిగ్గుచేటన్నారు. మంత్రి వెంకట్‌రెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్రవాదిలా మాట్లాడకుండా నోరు అదుపులో ఉంచుకోవాలని హెచ్చరించారు. భువనగిరిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి మాట నిలబెట్టుకోవాలన్నారు. కేసిఆర్ కుటుంబాన్ని విమర్శిస్తే కాంగ్రెస్ నాయకులను ఎక్కడికక్కడ అడ్డుకుంటామన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ, మండలాధ్యక్షులు ఏవీ కిరణ్‌కుమార్, జనగాం పాండు, పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, జిల్లా నాయకులు ర్యాకల శ్రీనివాస్, అతికం లక్ష్మీనారాయణ, ఎక్బాల్ చౌదరి, నాగారం సూరజ్, శివకుమార్, సుభాష్, బబ్లూ పాల్గొన్నారు.

శ్రీశైలంలో లాంచీ దిగుతున్న పర్యాటకులు

అలలపై అలా..

సాగర్ నుంచి శ్రీశైలానికి రెండో లాంచీ ట్రిప్

నందికొండ, నవంబర్ 9 : పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నాగార్జునసాగర్ హిల్‌కాలనీ లాంచీ స్టేషన్ నుంచి శనివారం శ్రీశైలానికి లాంచీ ట్రిప్‌ను ప్రారంభించారు. ఈ నెల 2 మొదటి ట్రిప్ విజయవంతంగా సాగడం, పర్యాటలకుల నుంచి నుండి మంచి స్పందన రావడంతో తాజాగా 110 మంది ప్రయాణికులతో ఉదయం 9 గంటలకు లాంచీ బయల్దేరి సాయంత్రం 4 గంటలకు శ్రీశైలం చేరుకున్నది. ఆదివారం ఉదయం 9 గంటలకు శ్రీశైలం నుంచి 80 మంది ప్రయాణికులతో తిరిగి బయలుదేరి సాయంత్రానికి సాగర్‌కు చేరుకుంటుందని అధికారులు తెలిపారు. లాంచీ ప్రయాణంలో నాగార్జునకొండ, చాకలి గట్టు, ఏళేశ్వరం గుట్ట, లింగాలగట్టు, మద్దిమడుగు, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌ను చూసుకుంటూ లాంచీ ప్రయాణం సాగుతుంది.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

అండర్-14 బాలికల విభాగంలో జిల్లా జట్టు విజయం

తుర్కపల్లి, నవంబర్ 9 : యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని మాదాపురం ఉన్నత పాఠశాలలో మాదాపురం డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 68వ రాష్ట్రస్థాయి పాఠశాలల కబడ్డీ పోటీలు శనివారం ముగిశాయి. ఈ పోటీల్లో ఉమ్మడి 10 జిల్లాల నుంచి మొత్తం 30 జట్లు పాల్గొన్నాయి. అండర్-17 బాలుర విభాగంలో వరంగల్ జట్టు ప్రథమ స్థానంలో నిలువగా, రంగారెడ్డి ద్వితీయ, నల్లగొండ జట్లు తృతీయ బహుమతిని గెలుచుకున్నాయి. అండర్-14 బాలుర విభాగంలో ఖమ్మం జట్టు ప్రథమ స్థానంలో నిలువగా, రెండో స్థానం నల్లగొండ, మూడో స్థానం రంగారెడ్డి జిల్లా జట్లు దక్కించుకున్నాయి. అండర్-14 బాలికల విభాగంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టు ప్రథమ బహుమతి గెలుచుకున్నది. రెండో స్థానంలో ఖమ్మం, మూడవ స్థానంలో రంగారెడ్డి జిల్లా జట్లు నిలిచాయి.

బహుమతుల ప్రదానోత్సవంలో డీఈఓ సత్యనారాయణ, ఎస్‌జిఎఫ్ స్టేట్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర సెక్రటరీ కుంభం రాంరెడ్డి, ఎంఈవో మాలతీ, తహసీల్దార్ దేశ్యా, చింతపండు వెంకటేశం, లింగంపల్లి విజయ్, చంద్రశేఖర్, కొమిరిశట్టి నర్సింహులు, శట్టయ్య పాల్గొన్నారు.

కోసింది కొండంత... కొన్నది గోరంత

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం

సూర్యాపేట మార్కెట్‌కు భారీగా వచ్చిన ధాన్యం

- సూర్యాపేట జిల్లాలో ఇప్పటివరకు కొన్నది 6,532 మెట్రిక్ టన్నులే
- అంతా దొడ్డు రకమే.. సన్నాల కొనుగోలు జీరో
- సర్కారు కొర్రీలతో మిల్లర్లకే విక్రయిస్తున్న రైతులు

సూర్యాపేట, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ) : సూర్యాపేట జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. దాదాపు మూడు వారాల నుంచే రైతులు వరి కోతలు మొదలు పెట్టగా, ప్రభుత్వం మాత్రం తాపీగా నాలుగు రోజుల కిత్రమే కొనుగోళ్లను ప్రారంభించింది. జిల్లాలో 4,72,000 ఎకరాల్లో వరి సాగు కాగా.. 3,79,000 ఎకరాల్లో సన్నాలు, 93 వేల ఎకరాల్లో దొడ్డు రకం సాగైనట్లు అధికారిక లెక్కలు చెప్తున్నాయి. ఇప్పటివరకు సన్న రకాల కోతలు 35 శాతం పూర్తి కాగా, దొడ్డు రకం సాగానికిపైగా పూర్తయ్యాయి. కానీ, ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని పరిశీలిస్తే సర్కారు తీరు తేటతెల్లమవుతున్నది. దొడ్డు రకం ధాన్యాన్ని ఇప్పటివరకు 6,532 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయగా.. సన్నాలను అసలు కొన్నదే లేకపోవడం గమనార్హం. ప్రభుత్వం సన్న ధాన్యానికి బోనస్ ఇస్తామని ప్రకటించినప్పటికీ కొనుగోలు కేంద్రాలను మొదట్లో ప్రారంభించకపోవడంతో రైతులు నేరుగా రైస్ మిల్లుల్లో విక్రయించారు. పైగా, 17శాతం తేమ కొర్రీతో ఇప్పటికీ మిల్లులకే తరలిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే బోనస్ సంగతి దేవుడెరుగు.. సన్న ధాన్యం తీసుకెళ్లి ఐకేపీ కేంద్రాల్లో పోస్తే ధాన్యం రంగు మారుతుందని, 17శాతం తేమ వచ్చే వరకు ఎండబెడితే తూకం తగ్గుతుందని రైతు లు వాపోతున్నారు. దాంతో పచ్చి వడ్లనే ఎంతోకొంత ధరకు మిల్లలకు విక్రయిస్తున్నారు. మరోవైపు కొనుగోలు కేంద్రాల్లో పది నుంచి పదిహేను రోజులపాటు ఉన్న ధాన్యం రంగు మారడంతో మిల్లర్లు దిగుమతి చేసుకోకపోవడంతో అధికారుల పడిన పాట్లు అన్నీ ఇన్నీ కావు. తాజాగా శుక్రవారం అర్ధరాత్రి దాటేంత వరకూ మిల్లర్లతో చర్చలు జరిపి ఎట్టకేలకు దిగుమతి చేయించారు. గతంలో నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ఆయకట్టులో మాత్రమే అత్యధికంగా సన్నరకం వడ్లు సాగు చేశారు. కాళేశ్వరం నుంచి జలాలు సూర్యాపేట జిల్లాకు రావ డం మొదలైనప్పటి నుంచి తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాల్లోనూ సన్నాల సాగు పెరిగిం ది. జిల్లాలో 4,72,000 ఎకరాల్లో వరి సాగు కా గా, ఇందులో 3,79,000 ఎకరాల్లో సన్నాలే సాగు చేయడం విశేషం. కానీ, ఇప్పటివరకూ సన్నరకం ధాన్యం ఒక్క గింజ కూడా ప్రభుత్వం కొన్న దాఖలాలు లేవు. దొడ్డు రకం కూడా కేవలం 6,532 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు.

సదర్ సంబురం

భువనగిరి అర్బన్, నవంబర్ 9 : భువనగిరి పట్టణంలోని వినాయక చౌరస్తాలో శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో శనివారం రాత్రి సదర్ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. పాత బస్టాండ్ నుంచి వినాయక చౌరస్తా వరకు డప్పు వాయిద్యాల నడుమ దున్నపోతుల విన్యాసాలతో ఊరేగింపు తీశారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, రాజ్యసభ సభ్యుడు మందడి అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, దూదిమెట్ల బాలరాజు యాదవ్, క్యామ మల్లేశ్ పాల్గొన్నారు